# నాటక సమయాలు
(Conventions)

నాటక నిర్మాణం, ప్రదర్శనా సౌలభ్యం – మిగిలిన అన్ని కళలలో మాదిరిగానే, నిజానికి సమాజ నిర్మాణం మాదిరిగానే కొన్ని నియమాలకు లోబడి మసులుకుంటుంది. ఆ నియమాలే (నాట్యశాస్త్ర పరిభాషలో వాటినే సమయాలు అంటున్నారు.) నాటకం అటు రచనగాను, ఇటు ప్రదర్శనగాను మనుగడ సాధించగలదు. నాటకం రచనా, ప్రదర్శనల్లో ఈ 'సమయం' లేదా 'నిమయం' నాటక రచయితలకి లేదా ప్రదర్శకులకు ప్రేక్షకులకు మధ్య నాటక అవగాహనకు, ఆస్వాదనకుగాను, కుదిరే ఒక ఒప్పందం అనుకోవచ్చు. ప్రతి ఆటకూ కొన్ని నియమాలు ఉండక తప్పదుకదా। ఉదాహరణకు క్రికెట్ ఆటలో ఇంతమంది ఆటగాళ్ళు ఈ విధంగా ఆడాలని, ఒక్కొక్క ఓవర్‌కు ఇన్ని బంతులు ఉండాలని, బంతి ఆటస్థలం బౌండరీ దాటితే నాలుగు పరుగులనీ……ఈ విధమైన ఆడేవాళ్ళు చూసేవాళ్ళు కూడా ఆమోదించి ఆచరణలో పెట్టే కొన్ని నిమమాలు రచయిత, నట, ప్రేక్షకుల పరస్పర ఆమోదాన్ని పొంది, ఆచరణలో నిబద్ధించే కొన్ని నియమాలు ఉన్నాయి. ఈ నియమాలు నిజమనికాని వాస్తవిమని కాని ఇరుపక్షాలు నమ్మకపోయినా, నాటకాన్ని రసమత్తరంగా ప్రదర్శించడానికి, ప్రదర్శనను అనుభవించడానికి ఈ నియమాలు ఉపకరిస్తాయి. భ్రమాత్మమైన ఈ పద్ధతులు ప్రేక్షకుల ఆమోదాన్ని పొందితేనే నాటకం నిజం అనిపించే భ్రమ అని వారు విశ్వసించగలుగుతారు.

ఈ నియమాలను, సౌలభ్యం కోసం రెండు రకాలుగా విభజించవచ్చు; నిత్య నియమాలు, తాత్కాలిక నియమాలు – అని. నాటక ప్రదర్శనా రచనలలో ఆయా కాలాల నిమిత్తం కాకుండా సర్వకాల, సర్వ అవస్థలలోను అమలులో ఉండే నియమాలను నిత్య నియమాలు అని, కొన్ని కొన్ని యుగాల్లో, దశల్లో అమలులో ఉండి తరువాత పాటింపబడని నియమాలను తాత్కాలిక (తత్కాల) నియమాలని అనుకోవచ్చు.

నిత్య నియమాలు నాటకాన్ని కళాత్మక రూపకంగా అవగాహన చేసుకుని ఆనందించడానికి, తాత్కాలిక నియమాలు ఏదో ఒక దశలో రాయబడిన నిర్దేశిత నాటకాల అవగాహనకు ఉపకరిస్తాయి. ప్రతి ఆటలో మాదిరాగానే ఈ నియమాలు – అటు ప్రేక్షకులకు ఇటు నటీనటులకు నిర్దిష్టమైన అవగాహనను, ఆమోదానికి – యోగ్యమైతేనే వానిని నియమాలు అంటాం. ఏ ఒక్క నాటక రచయితో, ఏ ఒక్క దర్శకుడో ఒక పద్ధతిని అమలు చేస్తే దానిని ఈ నియమాలలో భాగంగా పరిగణనలోకి తీసుకోవడం సాధారణంగా జరుగదు. అటువంటి నియమాలు నిర్దిష్టంగాను, తర్కబద్ధంగాను (నాటక రచనా, ప్రదర్శనల పరిధిలో) ఉండాలి. ఈ నియమాలను అమలు చెయ్యడం, ఆమోదించడం, ఆస్వాదించడం, ఆస్వాదించడం వల్లనే కావెరిడ్జ్ చెప్పిన "Willing suspension of disbelief" నాటకం "అపనమ్మకాన్ని కావాలనే పక్కన పెట్టడం" అనే ప్రఖ్యాత వివరణకు ఆధారం అయింది.

సర్వసాధారణమైన కొన్ని నియమాలు మనకందరకూ నిత్యమూ అనుభవైక వేద్యాలే। వేషంలో ఉన్న పీసాపాటి నరసింహమూర్తిని కృష్ణుడనీ, మాధవపెద్దిని దుర్యోధనుడనీ ఆ నాటకం జరిగేటంత సేపూ మనం నమ్ముతాం. నిజజీవితంలో వాళ్ళు కృష్ణుడు, దుర్యోధనుడు కారని మనకు తెలుసు. ఇక్కడ ఏం జరుగుతున్నది?

'మానసిక మార్పిడి లేదా ప్రాతినిధ్యం? (Psychological substistution). ఒక పాత్ర కనిపించే రీతి, మాట్లడే విధానానను బట్టి ఈ పాత్ర ఫలానా అని మనం గుర్తుపట్టేస్తాం. ఆ నాటకంలో అన్ని నియమాలు ఇలానే ఉంటాయి. నిజానికి లోహితాస్యుడు చనిపోయినాడనీ, నలుడి రూపం మారి బాహుకుడు కాడని, అవి అన్నీ ఆయా గాథలను మనం నిజం అని నమ్మడానికి రూపొందింపబడిన నిజానికి నాటక ప్రదర్శనే ఒక నియయం కదా। మనసిక కల్పనలే।

నటులు పాత్రధారణ చేసి నాటకం జరిగినంతసేపూ తాము ఫలానా, ఫలానా నటులం కాదనీ, తాము ధరించిన పాత్రలమేనని తమ్ముతాము నమ్మించుకొని ప్రేక్షకులను నమ్మించడం నాటక నిమమాలలో అతి ముఖ్యమైనది. ఆయా పాత్రలలకు సహజమైన ఆంగిక, వాచిక, సాత్త్విక విన్యాసంతో, ఆ పాత్రలకు అనువైన ఆహార్యాలతో మనముందు నిలిచి, తాము భావించి వ్యక్తీకరించే ఉద్వేగాలు ఆయా పాత్రల స్వభావాలకి, సహజమని మనలను సమ్మిస్తేనే మనం ఆయా పాత్రల మనో ధర్మాలతో తాదాత్మం చెంది ఆ పాత్రల ఉద్వేగాలను మనవిగా భావించి నాటక ఆస్వాదనలో భాగస్వామ్యం అవుతాం. ఈ నిజంలో కనిపించే భ్రమే నాటకానికి మూలకందం.

నాటక ప్రదర్శనలో మనం మరో నియమాన్ని కూడా గమనించవచ్చు. నాటకంలో అభివ్యక్తమయ్యే కార్యకలాపాలన్నీ ఆది. మధ్య, అంతాలలో నిబంధించబడి ఉంటాయి. ఇలా చెయ్యడానికి ఆయా కార్యాలు జరిగిన కాలాన్ని కుదించడం జరుగుతుంది. ప్రకాశం గారి 84 సం॥ల జీవితాన్ని రెండున్నర గంటల నాటకంగా కుదించడంలో ముఖ్యమైన ఘట్టాలను స్వీకరించి, మిగిలిన వాటిని వదిలివేస్తే ఆ ప్రక్షిప్తాలను మనం ఆమోదిస్తున్నాం. కథను నాటకానికి అనువుగా కుదిస్తున్నాం. అంటే స్థల, కాలాలను కూడా కుదిస్తున్నామన్నమాట. ఈ స్థల కాల, కార్యాల కుదింపు సజావుగా, తర్కబద్ధంగా, సహేతుకంగా జరిగేటట్టు చూడడం వల్ల నాటక ప్రేక్షకుడికి నాటకకథ ఏకబిగిన జరుగుతున్నదన్న ఉద్ధేశ్యం కలుగుతుంది. అలాకలగా చేయడంలో ఉన్న అవసరం కోసమే అరిస్టాటిల్ మూడు ఐక్యాలు (three unities) ఉండవలసిన ఆవస్యకతను చెప్పి అందులో మరీ ముఖ్యంగా 'కార్యఐక్యత' (unity of action) ఉండి తీరాలన్న నియమాన్ని నిర్ధారించాడు.

నాటకంలో సన్నివేశం ముగిసి మరో సన్నివేశం ప్రారంభం కావడం, మరొక కాల పరిధిలో (time frame) రెండో సన్నివేశం మొదలుకావడం మనం చూస్తూ ఉండడం. ఆ సన్నివేశాలు మార్పును అంకాలుగా సూచించడం జరుగుతుంది. ప్రదర్శనలో అయితే అంకం అయిపోవడానికి సూచనగా తెరదించడంమో, లైట్లు ఆగి వెలగడమో జరగడాన్ని మనకు నిత్యానుభవమే। పూర్వం – గ్రీకు నాటకాలలో సన్నివేశం ముగింపును బృందగాయకులు పాడే పాటతోను, ఎలిజిబెత్ యుగంలో పాత్రలన్నీ నిష్క్రమిస్తే ఆదే అంకాంతమో, రంగాంతమో – అవుతుందని నియమాలుగా ఉంటూ వచ్చాయి.

అలాగే కాల, స్థల సూచలను కూడా కొన్ని నియమాలకు లోబడి నిర్ణయం అవుతాయి. ఎలిజిబెత్ కాలం నాటి నాటకాల పగటి పూట జరిగేవి కనుక ఒక దీపాన్నో, ఒక దివిటినో తీసుకవస్తే అది రాత్రి అని

ప్రేక్షకులు ఆమోదించేవారు. అలాగే పగటి పూటో రాత్రిపూటో ఫలానా సమయంలో ఈ సన్నివేశం జరుగుతున్నదని చెప్పడానికి కాంతి ప్రసరణాన్ని వాడుతున్నాం. అలాగే ప్రదేశాల సూచికలు కూడా. ఒక అడవినో ఒక వనవాటివనో చూపించాలంటే మూడు నాలుగు చెట్లను చూపుతున్నాం. అలాగే ప్రకాశ, నిష్క్రమణలుకూడా. మొదటి కొద్దినిమిషాలు పాత్రలు నాటక గతిని ఏ విధంగా నిర్దేశిస్తాయో, అదే విధానం నాటకం ఆసాంతం ఉంటుందనీ, ముందు చూపిన సూచికలు (suggestions) నాటకం అంతా ఉంటాయనీ ప్రేక్షకుడు ఇట్టే అర్థం చేసుకుంటాడు.

అలాగే రంగస్థలంమీద జరిగే అన్ని కార్యకలాపాలు కూడా ఇటువంటి పరస్పర అవగాహనతో అమలు జరిపే నియమాలే। ఇవి  వాచిక విన్యాసంలో చాలా ప్రముఖంగా కనిపిస్తాయి.

నటుడు తన మనసులోని భావాలను ప్రేక్షకులతో పంచుకోవడానిక స్వగతాలు మాట్లడటం, రంగస్థలం మీద చాలా పాత్రలు ఉన్నా, పక్క పాత్రకి మాత్రమే వినిపిచండానికి జనాంతికం మాట్లాడడం, రహస్యం మాట్లాడినా ప్రేక్షకులకు వినిపించాలని పెద్దగానే మాట్లాడడం వంటివి అన్నీ నాటక నియమాలే। నాటకంలోని వాచిక విన్యాసమే ఇక నియమం। నిత్యజీవితంలో ఇద్దరు మనుష్యులు మాట్లాడుకునేటప్పుడు బిగ్గరగా మాట్లాడుకోవడం జరుగదు. అది అవాస్తవికం. అయినా, నాటకంలో ప్రేక్షకుల సౌకర్యార్థం నటులు ఆఖరి వరుసలో కూర్చున్న ప్రేక్షకుడికి కూడా వినిపించేటంత బిగ్గరగా మాట్లాడవలసిందే। అదే ప్రేక్షకులు నటులు ఇద్దరూ ఒక సమాధానానికి, ఒప్పందానికి వచ్చిన నియమం।

అలాగే నాటక కవిత్వం, పద్య నాటకం కూడా। నాటక పాత్రలు పద్యాల ద్వారా సంభాషిచు కోవడం అవాస్తవికమే। అయినా ప్రేక్షకులు, నటులు సమాధాన పరుచుకున్న నియమమే అది। అలాగే కవితా నాటకాలు కూడా। అలాగే పౌరాణిక, చారిత్రాత్మకాలలో వాడే గ్రాంధిక భాషా ప్రయోగం కూడా। ఏ చారిత్రక కాలంలో నయినా ఆనాటి వ్యవహారికం ఒకటి ఉంటుందనీ, ఆనాటి ప్రతిపౌరుడూ కొంచెం తేడాలతో ఆ భాష మాట్లాడేవాడని మనిక తెలుసు. అయినా భటుడి దగ్గరనుంచి రాజుగారి వరకు అందరూ సంస్కృత పదభూయిష్టమైన గ్రాంధికంలో మాట్లాడతారు. ప్రేక్షకులు ఆమోదిస్తూనే ఉన్నారు.

ఇటువంటిదే మరో నియమం పాత్రల హావభావ ప్రదర్శన. ముఖ్యంగా అంగచలనాలు, మరీ ముఖ్యంగా హస్త చలనాలు చాలా నియమాలకు లోబడి ఉంటాయి. నిత్యజీవితంలో మనం వాడే హస్త చలనాలు చాలాకొద్ది; అవి కూడా నిర్థష్టంగా ఇదమిద్ధమని ఉండవు. నాటకం విషయంలో ఇవి నిర్ధిష్టంగా, నిర్ధేశిత భావ వ్యక్తీకరణకు మాధ్యమంగా ఉండాలి. చెబుతున్న సంభాషణకి అనువైన అంగచలనాలలు ఉంటేనే నాటకంలో పాత్రకు న్యాయం చేకూరుతుంది. నాటకంలో ఈ చలనాలు కొంచెం విస్తృతీకరించబడుతూ ఉంటాయి. రంగస్థల నటనకీ, సినిమా, టి.వి నటనకీ ఉన్న ముఖ్యమైన భేదాలలో ఇది ఒకటి. రంగస్థలం మీద నటుడు హావభావాలను మామూలు వాటికన్నా కొంచెం ఎక్కువగా వాడితే సినిమా, టి.వి. లలో ఈ హావభావాలు చాలా తగ్గించి వాడవలసి ఉంటుంది. ఏ చిన్న కదలిక అయినా విస్తృతీకరింపబడుతుంది టి.వి. సినిమా మాధ్యమాలలో.

రంగస్థలం మీద జరిగే కార్యకలాపాలలలో కూడా ఈ నియమాలను పాటిస్తాం. ఉదాహరణకి రంగస్థలం మీద చూపే కత్తి యుద్ధాలు జాగ్రత్తగా, నిజానికి దగ్గరగా ఉండేటట్లు రూపొందించే అవాస్తవిక నటనలో భాగమే। గాయాలు, కట్లు, జబ్బులు, మరణాలు ఇవన్నీ కూడా నిజానికి దగ్గరగా ఉండేటట్లు జాగ్రత్త పడతారు నటులూ, దర్శకుడూ.

ఇటువంటి నియమాలే దృశ్య పరికల్పనంలోనూ, కాంతి ప్రసరణలోనూ మామూలు. ముందే చెప్పినట్లు నామమాత్రంగా నాలుగు చెట్లను చూపి, వెనుక చెట్లు చిత్రించిన కర్టెన్ వేస్తే అది అడవి అనీ భ్రమ కలుగుతుంది. అలాగే భయానికి ఎర్ర లైటును, ఉదయానికి లేత నీలిరంగు లైటును వెయ్యడం వల్ల ఆయా సమయాల, ఆయా ఉద్వేగాల ఫలితాలను సాధిస్తాం.

కొన్ని నియమాలు ఒక కాలానికో ఒక పద్ధతిలో రాయబడే నాటకాలకో పరిమితం కావడం కూడా గమనించవచ్చు. పురుషులు స్త్రీ వేషం వేయడం ఇటువంటిదే। నాట్యశాస్త్రంలో స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలన్న నియమం ఉన్నా చాలా వందల సంవత్సరాలు – ఇటీవలి కాలందాకా – పురుషులే స్త్రీ వేషాలు ధరించేవారు. అలాగే గ్రీకు, ఎలిజబెత్ కాలాలనాటి పాశ్చాత్య నాటకాలలో కూడా. వాస్తవికతావాదం ప్రబలమై, ప్రపంచ ఆమోదం పొందిన తరువాత ఈ నియమం క్రమేపీ అంతర్ధానం అయింది. ఇవాళ కొన్ని ప్రత్యేక సమయాల్లో తప్ప (ముఖ్యంగా ప్రహసనాలలో) మగవాళ్ళు ఆడవేషాలు వెయ్యడం ఆగిపోయింది. అలాగే వెనుకటి రాజుల ఆహార్యం, గ్రీకులు వాడిన కరాళాలు, ఇవన్నీ ఒకనాటి ఆచారాలు.

ఇటీవలి కాలంలో నాటక ప్రదర్శనలలో చోటు చేసుకుని విడదీయరాని నాటక ప్రక్రియా రూపుదిద్దుకున్న వాస్తవిక నాటకం – ముఖ్యంగా నాలుగో గోడ సిద్ధాంతం – దానివల్ల ప్రభవించిన వాస్తవికతా ప్రక్రియలు ఈనాటి నాటకాలలో ప్రముఖంగా కనిపిస్తాయి. పాత్రోచిత భాష వాస్తవికతకు దగ్గరగా రావడానికి రచయితలు ప్రయోగించిన ఒక నియమమే।

ఒక నాటకంలో ఆది నుంచి అంతం వరకు రచయిత ఒక పద్ధతి నటననో, వాచిక విధానాన్నో ప్రవేశపెట్టవచ్చు. అది ఆ నాటకానికి మాత్రమే – లేదా అటువంటి నాటకాలకు మాత్రమే పరిమితం అయ్యే నియమాలు। ఆధునిక వీధి నాటకంలో ప్రదర్శకులు అవలంభించే అనేక పద్ధతులు ఈ కోవకు చెందినవే। అనిబద్ధ నాటాకాల (absurd plays) లో పాత్రలు మాట్లాడే "ఖండిత సంభాషణా పద్ధతి" ఆ రకం నాటకాలకు మాత్రమే పరిమితం।

ఏ నియమమైనా అది ఎందుకోసం వాడబడ్డదో, ఆ ఉద్దేశ్యం సఫలీకృతమైతే ఆ నియమం ప్రేక్షకుల ఆమోదాన్ని పొందుతుంది. అవి సహేతుకమైనవై, నాటకం ఆద్యంతమూ ఒకే పద్ధతిలో నడిచేవై ఉంటే ప్రేక్షకులు ఇట్టే ఆమోదిస్తారు.

నాటకమే ఒక పెద్ద నియమాల పుట్ట. అందులో ప్రతి అంగమూ నిజం అని చూపించడానికి పడే అబద్దపు ప్రయోగమే। ఈ “అబద్దపు నిజం” నిబద్ధం చేయబడడానికే నియమాల అవసరం వచ్చింది. నాటకం ప్రదర్శింపబడుతున్నంత కాలం ప్రేక్షకులకు ప్రదర్శకులకు మధ్య ఈ సయోధ్య, పరస్పర అంగీకారం తప్పవు. ఈ అంగీకారం నాటకాస్వాదనకు ప్రాణభూతమైన లక్షణం.